క్లుప్తంగా

150 మందికి కంటి వైద్య పరీక్షలు



మహిళకు మందులు అందజేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఆశవాని పాలెంలో ఏటీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని విశాఖ పశ్చిమ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి సమస్య విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించాలని సూచించారు. రోగులతో మాట్లాడి మందులు అందజేశారు. సుమారు 150 మందికి కంటి పరీక్షలు చేయగా 45మందికి కంటి ఆపరేషన్లు పడతాయని ట్రస్టు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముర్రు వాణి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి లేకుండా పథకాలు అందించాం



పాత కరాసాలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు పాత కరాసాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచారం జోరుగా సాగింది. ఈ ప్రాంతంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రతీ వీధిలో తిరుగుతూ అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం పాతకరాసా రామాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో జియ్యాని శ్రీధర్ మాట్లాడారు. ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్ కుమార్‌ను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతీ పేదవాడికి మేలు చేశారన్నారు. ప్రభుత్వ పథకాలు అవినీతి లేకుండా అందరికీ అందించారన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ఆనంద్ కుమార్ వచ్చిన తర్వాత అభివృద్ధి పరుగులు తీసిందని తెలిపారు. గతంలో మనం గెలిపించిన ఎమ్మెల్యే ఐదేళ్లకు ఒకసారి కనిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. తాను చేయని పనులు కూడా తన వల్లే జరిగాయని గొప్పలు చెప్పుకునే నాయకుడని విమర్శించారు. నిత్యం ప్రజల్లో ఉండి, వారి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించే నాయకుడు ఆనంద్ కుమార్ కావాలా..?, ఐదేళ్లకోసారి కనిపించే నాయకుడు కావాలా..? అని ప్రశ్నించారు. మంచి నాయకుడైన ఆడారి ఆనంద్ కుమార్‌ను ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, జియ్యాని మారుతి, సింహాచలం దేవస్థానం పాలకమండలి సభ్యురాలు శ్రీదేవివర్మ, పార్టీ నాయకులు, గృహ సారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

ఘనంగా సింహవల్లీ తాయారు తిరువీధి



అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కొలువుదీరిన సింహవల్లీ తాయారు అమ్మవారికి శుక్రవారం తిరువీధి ఘనంగా జరిగింది. అమ్మవారి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి పల్లకీలో వేంజేపచేశారు. ఆలయ బేడా మండపంలో తిరువీధి నిర్వహించి హారతి సమర్పించారు. కార్యక్రమాన్ని అర్చకుడు అప్పాజీ, పారాయణదారులు నిర్వహించారు.

స్థానికులకు ఉపాధి కల్పిస్తా

- ఎల్‌జీ పాలిమర్స్ సమస్య పరిష్కరిస్తా
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ హామీ
- 92వ వార్డు వెంకటాపురంలో విస్తృత ప్రచారం



ఎన్నికల ప్రచారంలో స్థానికులతో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్



ఆడారి ఆనంద్‌కుమార్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న వెంకటాపురం వాసులు

గోపాలపట్నం : ఎల్‌జీ పాలిమర్స్ సంస్థ సమస్యను పరిష్కరించి, స్థానికులకు ఉపాధి కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలో శుక్రవారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనని వెంకటాపురంలో స్థానికులు గజమాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్లలో నియోజకవర్గంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించినప్పుడు ఎల్‌జీ పాలిమర్స్ అంశం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఎల్‌జీ పాలిమర్స్ విష వాయువుల వల్ల ప్రాణాలు కోల్పోయిన ఘటన చాలా బాధాకరమన్నారు. మరోవైపు ఈ ప్రాణాంతక పరిశ్రమను నిలిపివేయడంతో కొందరు ఉపాధి కోల్పోయారన్నారు. దీనిపై ప్రత్యామ్నాయంగా ఏం చేయాలన్న అంశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఎన్నికల తర్వాత ప్రత్యామ్నాయంగా తగిన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. స్థానికులకు ఉపాధి కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీ లక్ష్మిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచారంలో ఆర్య వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గుణిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, నాయకులు, గృహ సారథులు, తదితరులు పాల్గొన్నారు.



ఆనంద్ కుమార్‌కు హారతిస్తున్న మహిళలు

ఆడారి ఆనంద్ కుమార్ గెలుపు కోరుతూ పూజలు



పెద్దింటమ్మ ఆలయంలో కార్పొరేటర్ సుధ, తదితరులు

మల్కాపురం : విశాఖ పశ్చిమ నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆడారి ఆనంద్ కుమార్ భారీ మెజార్టీతో విజయం సాధించాలని కోరుతూ 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యంలో శుక్రవారం పూజలు చేశారు. మల్కాపురం మార్కెట్ వీధిలో ఉన్న పెద్దింటమ్మ ఆలయంలో అమ్మవారికి పసుపు, కుంకుమతో పూజలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుధ మాట్లాడుతూ విశాఖ పశ్చిమ నియోజకవర్గానికి ఆడారి ఆనంద్‌కుమార్ వంటి మంచి మనిషి మా పార్టీ తరఫున పోటీ చేయడం మా అందరి అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఆనంద్‌కుమార్ గెలుపు కోసం తనతోపాటు గృహ సారథులు, సచివాలయాల కన్వీనర్లు, కార్యకర్తలు ప్రచారం చేస్తామన్నారు. జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం, దాడి సత్యనారాయణ, బాలు, మంగ, పిలక వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పేదల మేలు కోరే ప్రభుత్వమిది..

- వైఎస్సార్‌సీపీనే మళ్లీ గెలిపించుకుందాం
- యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి
- 62వ వార్డులో ఎన్నికల ప్రచారం



ఎన్నికల మ్యానిఫెస్టోతో కూడిన కరపత్రాలను అందిస్తున్న పిల్లా రమాకుమారి

సింధియా: పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసినంత మేలు మరే ముఖ్యమంత్రి చేయలేదని యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అన్నారు. ముఖ్యంగా మహిళా సాధికారతకు ఎనలేని కృషి చేశారన్నారు. జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్, టీడీపీ కాలనీ ప్రాంతాల్లో, కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ, ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో ఆడారి ఆనంద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఆనంద్ కుమార్‌ను ఆదరించి, ఆశీర్వదిస్తే పశ్చిమ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నంబర్ వన్‌గా నిలబెడతారన్నారు.

న్యాయమే గెలుస్తుంది

పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధంలో న్యాయమే గెలుస్తుందని రమాకుమారి అన్నారు. రాష్ట్రంలోని మొత్తం 175 స్థానాలను వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలిచి, దేశంలో చరిత్ర సృష్టించనున్నారన్నారు. ఈ ఎన్నికల్లో స్టార్ క్యాంపైనర్లు పేదప్రజలే అన్నారు. పేదలకు సేవచేసే భాగ్యాన్ని తన సోదరుడు ఆడారి ఆనంద్‌కుమార్‌కు ఇవ్వాలని కోరారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, తద్వారా నియోజకవర్గంలో ఏ సమస్య వచ్చినా దానిని వెంటనే పరిష్కరిస్తాడని అన్నారు. విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, మహిళలు పాల్గొన్నారు.

కుటుంబీకుల చెంతకు కార్మికుడు



కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న మమత

విశాఖ విద్య: ఎస్‌పీడీ బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం పొందుతున్న వలస కార్మికుడికి చికిత్స అనంతరం శుక్రవారం వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మన్నె లాల్ గైక్వాడ్ కొద్ది రోజుల క్రితం ఉపాధి నిమిత్తం ఝార్ఖండ్‌లోని కిలోరా గ్రామం నుంచి విజయనగరం సమీప రాజాం గ్రామానికి వలస వచ్చాడు. అక్కడి నుంచి ఆర్కే బీచ్ చూడడానికి విశాఖపట్నం వస్తుండగా రైలు ప్రమాదంలో మన్నె లాల్ గాయపడి కేజీహెచ్‌లో చేరాడు. అపస్మారక స్థితిలో ఉన్న మన్నె లాల్ నెలలు గడుస్తున్నా వివరాలు ఏమీ చెప్పలేక పోయాడు. దీంతో ఆయన్ని బుచ్చిరాజుపాలెం షెల్టర్ మేనేజర్ మమత కేజీహెచ్ నుంచి తీసుకొచ్చి ఆశ్రయం కల్పించారు. అనంతరం ఆర్‌పీఎఫ్ పోలీసుల సహాయంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించి వారిని బుచ్చిరాజు పాలెం షెల్టర్‌కి రప్పించారు. మన్నె లాల్ కుటుంబ సభ్యులు షెల్టర్ మేనేజర్ మమతకు ధన్యవాదాలు తెలిపారు.

జీవీఎంసీ ఆధ్వర్యంలో చలివేంద్రాల ఏర్పాటు



బుచ్చిరాజుపాలెం వద్ద బస్టాప్‌లో చలివేంద్రం



బాజీజంక్షన్ సమీపంలో బస్టాపు వద్ద ప్రజల దాహార్తిని తీరుస్తున్న చలివేంద్రం

గోపాలపట్నం: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. గోపాలపట్నం నుంచి ఎన్‌ఏడీ వరకు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతీ బస్టాపు వద్ద తాటాకు పందిరి వేసి, చలి వేంద్రాలను ఏర్పాటు చేశారు. జోన్ 8 పరిధిలో శుక్రవారం నుంచే మంచినీరు అందుబాటులో ఉంచారు. జోన్–5పరిధిలో ఇంకా మంచినీరు ఏర్పాటు చేయలేదు. ఈ చలి వేంద్రాల వద్ద ఒక వ్యక్తి అందరికీ మంచినీరు అందిస్తున్నారు.

సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాలకు ప్రాధాన్యం



ఆత్మీయ సమావేశంలో ఆనంద్‌కుమార్‌ను సత్కరిస్తున్న రెల్లి కుల సంఘాల నాయకులు

సింధియా: లోకా సమస్తా సుఖినోభవంతు అనే భావనతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందరి సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. ప్రతీ సామాజిక వర్గానికి ఆర్థిక చేయూత నిస్తూ, అనేక కార్పొరేషన్ల ద్వారా సంక్షేమాన్ని అందించారన్నారు. అటువంటి ప్రభుత్వాన్ని మళ్లీ ఏర్పాటు చేసుకునేందుకు ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని కోరారు. జీవీఎంసీ 40వ వార్డు కాకరలోవ రెల్లి కుల సంఘం 25వ వార్షికోత్సవ ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర రెల్లికుల సంఘాల అధ్యక్షుడు కొట్నాన రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆనంద్ మాట్లాడుతూ పేద, బలహీన, దళిత వర్గాల అభ్యున్నతి విద్యతోనే సాధ్యమవుతుందనే నమ్మకంతో ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక సదుపాయాలు కల్పించారన్నారు. ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టడంతో పాటు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్న జగనన్నకు మద్దతుగా ప్రజలందరూ నిలిస్తే, భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రతీ ఒక్కరు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. అనంతరం సంఘం సభ్యులు ఆనంద్‌కుమార్‌ను గజమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, 3 జిల్లాల వైఎస్సార్‌టీయూసీ ఇన్‌చార్జి కలిదిండి బద్రీనాథ్, 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్, స్థానిక నాయకులు వారధి పాపారావు, బొడ్డు దుర్గారావు, రెల్లికుల సంఘం నాయకులు యలగాడ రాజు, వడ్డాది హరి, పిన్నింటి రవి, ఆకుల సింహాచలం, లోకాండ అప్పారావు, కెల్ల మురళి, పి.శంకరరావు, కోన యల్లారావు, మజ్జి రాజు, ఇతర నాయకులు, రెల్లి కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆనంద్‌కుమార్ గెలుపు కోసం విస్తృత ప్రచారం



కరపత్రం అందించి ప్రచారం చేస్తున్న మాలతి, నాయకులు



ఏదరవానిపాలెంలో ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు



మల్కాపురంలో సమావేశంలో యాదవ సంఘ ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు

విశాఖ విద్య: విశాఖ పశ్చిమ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ గెలుపు కోరుతూ అతని సతీమణి మాలతి శుక్రవారం 90వ వార్డు పరిధిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. లక్ష్మీనగర్, ఏపీఎస్ఈబీకాలనీ, బుచ్చిరాజుపాలెం కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఆడారి ఆనంద్ కుమార్‌కు ఎమ్మెల్యేగా ఒక్క అవకాశమిస్తే నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేస్తారో వివరించారు. రాజకీయ పదవులతో పనిలేకుండా సేవ చేయడంలో తమ కుటుంబం ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరిన్ని సేవా కార్యక్రమాలు చేసే అవకాశం వుంటుందన్నారు. ప్రజలు తన భర్తను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు పేడాడ రమణి కుమారి, వార్డు నాయకుడు నమ్మి శ్రీను, చుక్కా ప్రసాద్ రెడ్డి, వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఏపీఎస్ఈబీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసరాజు మద్దతు ప్రకటించి పర్యటనలో పాల్గొన్నారు.

మల్కాపురం : వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ గెలుపు కోరుతూ ఆ పార్టీకి చెందిన నాయకులు శుక్రవారం ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం చేశారు. జీవీఎంసీ 58వ వార్డు ఏదరవానిపాలెం వద్ద పార్టీ వార్డు అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్‌రాజు ఆధ్వర్యంలో తోనంగి వెంకటరమణి యాదవ్, ఆ ప్రాంత గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. పేదల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఆనంద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

- జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీవాసులతో శుక్రవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ యాదవ్, పార్టీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ ఆడారి ఆనంద్ గెలిస్తే చేపట్టనున్న అభివృద్ధి పనులను వివరించారు.
- జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం విజ్ఞాన మండలి యాదవ సంఘం వద్ద నిర్వహించిన సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉరుకూటి అప్పారావు యాదవ్, ఇండ్రస్టియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, తోనంగి వెంకటరమణి, పుర్రె అప్పారావు తదితరులు మాట్లాడుతూ అందరి మంచి కోరే ఆడారి ఆనంద్‌కుమార్‌కు అండగా నిలవాలని, ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మల్కాపురం విజ్ఞాన మండలి యాదవ సంఘం ప్రతినిధులతోపాటు, వెంకన్నపాలెం యాదవ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో మెరిసిన విద్యార్థినులు

గోపాలపట్నం: ఇంటర్ పరీక్షల్లో మేహాద్రిగెడ్డ బాలికల రెసిడెన్షియల్ కళాశాల మంచి ఫలితాలను సాధించింది. ద్వితీయ సంవత్సర పరీక్షల్లో బైపీసీలో పి.కృష్ణ వేణి 953 మార్కులు సాధించగా, సీఈసీలో పి.యమున 953 మార్కులు సాధించింది. కళాశాలలో మొదటి సంవత్సరానికి సంబంధించి 64.81శాతం, రెండో ఏడాదిలో 73.84 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల నుంచి 54మంది విద్యార్థులు హాజరు కాగా, 35 మంది పాస్ అయ్యారు, 19 మంది ఉత్తీర్ణులు కాలేకపోయారు. రెండో ఏడాది పరీక్షలకు 65మంది హాజరు కాగా 48 మంది పాసయ్యారు, 17 మంది ఫెయిల్ అయ్యారు.

– గోపాలపట్నం ప్లస్ 2 బాలికల స్కూల్‌లో ఎంపీసీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 27మంది పరీక్షలు రాయగా ఏడుగురు మాత్రమే పాసయ్యారు. బైపీసీలో 28మందికి ఏడుగురు పాసయ్యారు. రెండో సంవత్సరంలో ఎంపీసీలో 14 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఒకరు మాత్రమే పాసయ్యారు. బైపీసీలో 14 మంది పరీక్షలు రాయగా ఒకరు, ఇద్దరు పాసయ్యారు. మొత్తంగా ఇక్కడ మొదటి సంవత్సరంలో 26 శాతం రెండో సంవత్సరంలో 11శాతం పాసయ్యారు.

ఫ్లిప్‌కార్ట్ గ్రోసరీ ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రం ప్రారంభం

- వెయ్యి మందికి ఉపాధి కల్పన

బీచ్‌రోడ్డు: ఉత్తరాంధ్రతో పాటు కాకినాడ, రాజమండ్రి ప్రాంతాలకు ఒక్క రోజులో కిరాణా సరకులను డెలివరీ చేసేందుకుగాను ఫ్లిప్‌కార్ట్ గ్రోసరీ ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాన్ని యలమంచిలి మండలం యర్రవరం గ్రామంలో ప్రారంభించినట్టు సంస్థ చీఫ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ రజనీష్ తెలిపారు. కేంద్రం ప్రారంభోత్సవ వివరాలను మీడియాకు ఆయన తెలిపారు. ఈ కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా రోజుకు 8వేల ఆర్డర్లను డెలివరీ చేయగలగుతామన్నారు. ఇందులో సుమారు వెయ్యి మందికి ఉపాధి కల్పించనున్నట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తమ మార్కెట్ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇప్పటికే విజయవాడలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఇది రెండో కేంద్రమని చెప్పారు. ఈ కేంద్రాల ద్వారా నేరుగా ఉపాధి కల్పించడంతో పాటు చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో కూడా ఉపాధి కల్పనకు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో హరి కుమార్ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఆర్ ఆస్పత్రిలో వైద్య శిబిరం రేపు

గోపాలపట్నం: గోపాలపట్నం ఎస్ఆర్ ఆస్పత్రిలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నామని ఆస్పత్రి చైర్మన్ సత్యానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ఉంటుందని తెలిపారు. శిబిరంలో పలువురు వైద్య నిపుణులు సేవలు అందిస్తారని, వినియోగించుకోవాలని సూచించారు.

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు వెల్లడించారు. విశాఖపట్నం–కొల్లాం(08539) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నంలో ప్రతీ బుధవారం ఉదయం 8.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. ఈ రైలు ఈ నెల 17 నుంచి జూలై 3వ తేదీ వరకు నడుస్తుంది. కొల్లాం–విశాఖపట్నం (08540) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ కొల్లాంలో ప్రతీ గురువారం రాత్రి 7.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైలు ఈ నెల 18 నుంచి జూలై 4వ తేదీ వరకు నడుస్తుంది.

- భువనేశ్వర్–యల్హంక(02811) స్పెషల్ భువనేశ్వర్‌లో ప్రతీ శనివారం రాత్రి 7.15 గంటలకు బయలుదేరి మరుసటిరోజు తెల్లవారు 1.53 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 1.55 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 11.55 గంటలకు యల్హంక వెళ్తుంది. ఈ రైలు ఈ నెల 13వ తేదీ నుంచి మే 25వ తేదీ వరకు నడుస్తుంది. యల్హంక–భువనేశ్వర్(02812) స్పెషల్ యల్హంకలో ప్రతీ సోమవారం ఉదయం 5 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు 4.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 4.32 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.15 గంటలకు భువనేశ్వర్ వెళ్తుంది. ఈ స్పెషల్ రైలు ఈ నెల 15 నుంచి మే 27వ తేదీ వరకు నడుస్తుంది.
- హౌరా–యశ్వంత్‌పూర్(02863) వీక్లీ ఏసీ స్పెషల్ ప్రతీ గురువారం హౌరాలో మధ్యాహ్నం 12.40 గంటలకు బయలుదేరి మరుసటిరోజు తెల్లవారు 2.43 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 2.45గంటలకు బయలుదేరి అదేరోజు మధ్య రాత్రి 12.15 గంటలకు యశ్వంత్‌పూర్ వెళ్తుంది. ఈ స్పెషల్ ఈ నెల 18 నుంచి జూన్ 27వ తేదీ వరకు నడుస్తుంది. యశ్వంత్‌పూర్–హౌరా (02864) వీక్లీ ఏసీ స్పెషల్ ప్రతీ శనివారం యశ్వంత్‌పూర్‌లో తెల్లవారు 5 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 11.07 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1.25 గంటలకు హౌరా వెళ్తుంది. ఈ స్పెషల్ ఈ నెల 20 నుంచి జూన్ 29వ తేదీ వరకు నడుస్తుంది.
- కొచ్చువేలి–షాలిమర్(06081) స్పెషల్ ప్రతీ శుక్రవారం సాయంత్రం 4.20 గంటలకు కొచ్చువేలిలో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10.50 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 10.52 గంటలకు బయలుదేరి ప్రతీ ఆదివారం మధ్యాహ్నం 1.40 గంటలకు షాలిమర్ వెళ్తుంది. ఈ రైలు ఈ నెల 12 నుంచి మే 31వ తేదీ వరకు నడుస్తుంది. షాలిమర్–కొచ్చువేలి(06082) స్పెషల్ షాలిమర్‌లో ప్రతీ సోమవారం మధ్యాహ్నం 2.20గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు 4.18 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 4.20గంటలకు బయలుదేరి ప్రతీ బుధవారం ఉదయం 9.55 గంటలకు కొచ్చువేలి వెళ్తుంది. ఈ రైళ్లు ఈ నెల 15 నుంచి జూన్ 3వ తేదీ వరకు నడుస్తుంది.
- న్యూటిన్‌సుకియా–బెంగళూరు(05952) స్పెషల్ ప్రతీ గురువారం రాత్రి 6.45గంటలకు న్యూటిన్‌సుకియాలో బయలుదేరి మూడవ రోజు మధ్యాహ్నం 1.50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడి నుంచి 2.10గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9గంటలకు బెంగళూరు వెళ్తుంది. ఈ రైలు మే 2వ తేదీ నుంచి జూన్ 27వ తేదీ వరకు నడుస్తుంది. బెంగళూరు–న్యూటిన్‌సుకియా(05951) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ బెంగళూరులో ప్రతీ సోమవారం మధ్యరాత్రి 12.30 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 9.40 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడి నుంచి 10 గంటలకు బయలుదేరి ప్రతీ బుధవారం మధ్యాహ్నం 1.15గంటలకు న్యూటిన్‌సుకియా చేరుకుంటుంది. ఈ రైలు మే 6 నుంచి జూలై 1వ తేదీ వరకు నడుస్తుంది.